# సవరణ

## తాతిరాజు

మనిషి జీవితంలో సగం తప్పులు చెయ్యటంతోనూ. మిగతా సగం వాటిని సరిదిద్దుకునే ప్రయత్నంతోనూ సరిపోతుందని ప్రతీతి.

ఈ విషయం "చర్చిస్తూ సరిదిద్దుకునే ప్రయత్నంలో మరిన్ని తప్పులు చెయ్యడంతోనూ సరిపోతుంది" అని సవరించాలని శిరోమణి అన్నప్పుడు ఆ ప్రతిపాదన మాలో ఎవరికీ నచ్చలేదు.

నేనూ, పాత్రో ఒకరి మొహం ఒకరు చూసుకున్నాం. కాని ఎవ్వరం దానిమీద వ్యాఖ్యానం చెయ్యలేదు. శిరోమణి వాగ్ధాటి అలాంటిది. పొరబాటున "భార్య మాట విననివాడు భారతీయుడు కాడు." అనేశాడనుకుందాం. పదిమందితోనూ వాదించి అది నిజం అని ఒప్పించగలడు.

ఎప్పుడో ప్రదర్శించిన ఎగ్జిబిషన్ వాళ్ళ ధర్మమా అని గ్రౌండ్సు మధ్యలో వెలసిన విశాలమైన చప్టామీద కూర్చున్నాం నలుగురమూ. ఉద్యోగాల్లేవు. కాలేజీలో చెప్పిన చదువంతా చదివేశాం. ఇంకేం చెయ్యాలో తోచక ప్రతిరాత్రి అక్కడ చేరి నిద్రముంచుకొచ్చేదాకా కబుర్లాడుకుంటుంటాం.

ప్రక్కనున్న జ్యోతీ సినిమాహాల్లోంచి ఏదో ఏడుపుగొట్టు పాట మంద్రంగా వినిపిస్తోంది. చల్లని గాలి ఆగిఆగి వీస్తోంది. గాంధీనగరం ఇళ్ళలోంచి ఎవరో ప్రాక్టీసు చేస్తున్నారు కాబోలు ఆహ్లాదకరంగా మురళీ నాదం వినిపిస్తోంది. కంట్రాక్టరు సరఫరా "బిహారీమాల్" సేవించివచ్చాడు కాబోలు ఒక టాక్సీ డ్రయివరు తూలుతూ వెళుతున్నాడు.

"ఎన్నిసార్లు చెప్పేను వాడికి, త్రాగుడు మానమని" అన్నాడు శిరోమణి గంభీరంగా, వెళుతున్న మనిషిని ఉద్దేశించికాదు.

"మేం ఇంత సేపూ మాట్లాడుకుంటున్నది శీనూ గురించి. శీనూ మాకెవరికీ చుట్టం కాదు. ఆప్తమిత్రుడూ కాదు. శిరోమణికి ఏడాదిక్రితం క్లాస్‌మేట్. కనక వాళ్ళిద్దరికీ పరిచయం వుంది. మేం శిరోమణివాళ్ళ కన్నా జూనియర్ బాచ్‌లో ఉన్నప్పుడు కాలేజి హీరోగా వెలిగిపోతూ వుండేవాడు శీను. అందుకేనేమో అతనిపట్ల నాకు గౌరవం ఏర్పడింది.

ఉన్న ఊళ్ళోనే ఉద్యోగం దొరకడంతో అదృష్టవంతుడనిపించుకున్నాడు అందరి నోటా. కొద్ది రోజుల్లోనే ఎవరో అమ్మాయిని లేవదీసుకువచ్చాడని వదంతి. రెండుమూడుసార్లు సినిమాల్లో చూసేను ఆమెని అతని ప్రక్కన. మనిషి ఏమంత అందగత్తె కాదు, ఏంచూసి చేసుకున్నాడో గాని.

ఆ మాటే నిశాకర్‌తో అంటే "ఆత్మ సౌందర్యం" అన్నాడు నవ్వి. ఊళ్ళోచాలామందికి అతని పచ్చని జీవితాన్నిచూస్తే కన్నెర్రగా వుండేది. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుని కులాసాగా వుండేవారు.

ఓ నాడు శిరోమణి ఎగ్జిబిషన్‌లో వాళ్ళిద్దర్నీ నాకు పరిచయం చేశాడు. సరదాగా గడిపాం ఎగ్జిబిషన్‌లో చూసిన గంటసేపూ

"రియల్ హీరో" అన్నాను; అతన్ని గురించి.

"అంతగా పొగడకు. ప్రేమ మత్తు దిగిందో, ప్రేమా పాడూ లేక ఆదర్శం వెలగబెడుతున్నాననుకుని చేసుకున్నందువల్లో, ఇప్పుడు వాళ్ళేమంత సఖ్యతగా వుండటంలేదు" అన్నాడు శిరోమణి. చాలాకోపం వచ్చింది శిరోమణిమీద. అతనిమీద జెలసీగాని లేదుకద వీడికి,

ఓరోజు మిత్రత్రయం ఒకమ్మాయి జాతకం కనుక్కునే ప్రయత్నంలో ఉన్నప్పుడు పాత్రో ఒగరుస్తూ వచ్చి చెప్పేడు- "శీనూ మిసెస్సు ఎగిరిపోయింది బ్రదరూ" అని.

"నోరుముయ్యి" అని కసిరేను, ఆ వార్త నమ్మబుద్ధి కాలేదు నాకు. వాడు బీరుబాటిల్ పందెం కాయమని సవాలు చెయ్యడంతో నమ్మక తప్పలేదు.

"ఎందుకు పారిపోయిందిట?" అడిగాను; కుతూహలంగా. "శీనూగాడు అనుమానాల్తో ఆమెను చిత్రహింస పెట్టేడట. ఆమె తారెత్తి పారిపోయింది పుట్టింటికి" ఎలా పోగుచేస్తాడో సమాచారం, మా పాత్రో. కేసు తాలూకు ఫైల్ చదువుతున్నట్టు ఏ అమ్మాయిని గురించయినా ఏకరువు పెడతాడు. వాడికదో హాబీ, లెక్చరు కొట్టే అవకాశం వదులుకోలేదు.

"అంతే కావాల్సెడ్డూ. ఆ అమ్మాయి మంచి పనే చేసింది. మగవాడి దురహంకారాన్ని ఆడది భరించి పడివుండే కాలంపోయింది. వేరుంటే విలువ తెలిసొస్తుందని కొన్నాళ్ళకి అతనే గ్రహిస్తాడు- తానేం కోల్పోయాడో." అన్నాను.

శీనూ కొన్నాళ్ళకి వేషం మార్చేడు. లాల్చీ; షరాయి.... దరిమిలాను గడ్డాలు కూడా పెంచేడు. అయినా ఫలితంకనపడలేదు కాబోలు తాగి తిరగడం ప్రారంభించేడు. కొన్నాళ్ళ తరువాత అన్నీ మానేసి మళ్ళా టింగురంగా అని తయారయ్యేడు.

మధ్యలో మాకూ సమస్య లొచ్చిపడ్డం చేత అతని ఊసుపట్టించుకోలేదు కొన్నాళ్ళు. శిరోమణి కెవరో పిల్లనిస్తామని పట్టుబట్టేరు. "ఉద్యోగం లేదు. అది ముందు దొరకాలి మొర్రో" అని మొత్తుకుని నానా యాతనాపడి ఎలాగో తప్పించుకున్నాడు. పిల్ల ఏమీ బాగుండదని తరవాత తెలిసింది మాకు. నిశాకర్‌గాడికి ఉన్నట్టుండి ఏం బుద్ధి పుట్టిందో-లా చదువుతానని ప్రారంభించేడు. వాడు రాత్రిళ్ళు లా క్లాసెస్‌కు అటెండవుతే గట్టుమీద మా కబుర్లేంగాను. నచ్చచెప్పినావినకుండా "ఏదో ఒకటి ఉత్తినే దావల్‌ఖరాబీల్లా తిరగడంకన్నా నయంరా. నిరుద్యోగి అని చెప్పుకునేకంటే స్టూడెంటు అనిపించుకుంటే గౌరవం. చదవాలా పాడా పుస్తకాలు ముందెటుకుని రాయడానికి- క్లాసులు. ఎటెండవుతానుట్రా!" అని మా జట్టువీడనని హామీ యిచ్చి లా కాలేజీలో చేరేడు. మా అందరి రుసరుసలూ మరిపించడానికని కాఫీ ఇస్తానన్నాడు.

జ్యోతీ హాలుముందర టీ బడ్డీలో దొరికేటటువంటి కాఫీ బరంపురంలో ఇంక ఎక్కడాదొరకదు. బడ్డీవాడు పూర్వజన్మలో నలుడని మా అనుమానం. బడ్డీదగ్గరచేరి కాఫీలు సేవిస్తుండగా ఇంటర్‌వల్ అయింది. సినిమా జనం బయటపడ్డారు త్రాహిత్రాహి అనుకుంటూ.

సిగరెట్టు ముట్టించబోయిన నిశాకర్ చేతిలోంచిఅదిజారిపడింది వాడి కళ్ళనిమేం అనుసరించగా-ఎదురుగా శీను పక్కనున్న ఒక వన్నెల విసనకర్ర, కళ్ళు బడ్డీ వాడిని

ఫాంటూ అడుగుతున్నాడు. ఆ అమ్మాయి చరిత్రంతా తెలవారేసరికి తెచ్చిస్తానని పాత్రో శపథం చేశాడు.

పాత్రో తెచ్చిన వివరాలు ఆమెపట్ల ఏమాత్రమూ గౌరవము కలిగించేవి కావు. శిరోమణి అడిగితే, అతనన్నాడట —" అవసరం కోసమేకాదు బ్రదరూ. ఈ సంగతి ఈ నోటా ఆ నోటా విని అయినా నా భార్య నన్ను దక్కించుకోవాలని నా గడప తొక్కాలని!" అన్నాడట. ఎలాగయినా ఆమే తిరిగి రావాలని అతని పంతం.

నాకేం నచ్చలేదతని వరస. తప్పు మీద తప్పు చేస్తున్నాడు. అంతగా కాపురం చక్కబెట్టుకోవాలనుకుంటే ఒక్కసారి వెళ్ళి ఆమెను అర్థిస్తే ఆమె రాదా ఏం? ఈ డొంక తిరుగుడు పద్ధతి ఎందుకు! బాగా చెడ్డపేరు తెచ్చుకుంటున్నాడు అనవసరంగా. బజారు వ్యవహారం ఎన్నాళ్ళు సాగుతుంది గనుక.

రెండునెలల తరవాత పాత్రో చెప్పాడు వాడెవడో నాటకాల నాగేశంతో ఆమెను అనుమానాస్పదమైన పరిస్థితిలో ఆమెను చూసినట్టు. వారంరోజులు తిరిగేసరికా అమ్మాయి నాటకాల నాగేశంతో మద్రాసు ప్రయాణం అయింది.

శీనూసంగతే విడ్డూరం. కట్టుకున్న భార్య విడిచి వెళ్ళిపోయినప్పుడు లేని సిగ్గు ఇప్పుడేమిటో. ఎవరికీకనబడటం మానేశాడు.

"శీనూ పెళ్ళాన్ని తీసుకొచ్చేడట" పాత్రో సమాచారం. శిరోమణి ధృవీకరించేడు ఆ వార్తని. ఒక్కర్తే రాలేదు నెలల పాపాయిని వెంటబెట్టుకుని వచ్చింది" అన్నాడు.

రోజు లెప్పుడూ ఒక్కలాగే వుండవుగా. నిశాకర్‌కి, నాకు బ్యాంకి ఉద్యోగాలకి పిలుపులొచ్చాయి. శిరోమణి. పాత్రో ఏదో ఫర్మ్‌లో ఉద్యోగానికి ఇంటర్‌వ్యూకివెళ్ళేరు ఈ హడావుడివల్ల నాలుగయిదురోజులు [illegible]త్రుళ్ళు కలుసుకోలేదు మేం.

ఏడ్రోజులు పోయాక గట్టుమీద సమావేశం అయ్యాం. శిరోమణి రాలేదు. పాత్రో సీరియస్‌గా వున్నాడు. నిశాకర్ వూరికే పొగ వూదేస్తున్నాడు. నేను చకచక కళ్ళు నమిలేసి గద్దించేను "ఏమిటీ సైలెన్సు" అని.

"వాడు ఛండాలుడు" అన్నాడు పాత్రో ఉపోద్ఘాతం లేకుండా.

"ఎవడు?"

"వాడే- ఆ శీనూగాడు. ఇంత ఛండాలుడనుకోలేదు. అసలు మగ వెధవకి అనుమానం అనేది రాకనేపోవాలి. వచ్చిందా ప్రాణాలు తినేస్తుంది."

"ఎవడ ప్రాణాలు తినేసిందిట!" అడిగాను సగంలో సీరియల్ నవల చదవటం మొదలుపెట్టిన పాఠకునిలావిసుక్కుని.

"ఆవిడే. ఆ శీనూ భార్యని."

"ఈజిట్!"

"అవును. ఆ వెధవని ఆ పాపాయి. తనవల్ల పుట్టిందేనా అన్న నీచమయిన అనుమానం వొచ్చి ఆమెను వేధించేడట. అటువంటి అనుమానం భర్తకి వచ్చేక ఆమె ఎలా కాపురం చేస్తుంది? బ్రతుకు మీద విరక్తిపుట్టి ఆత్మహత్య చేసుకుంది."

"అతను....?"

"వాడికింక మొహం చెల్లుతుందా ఈ వూళ్ళో. చెప్పా చెయ్యకుండా ఎటో పోయేడు."


ఆవేళ గ్రౌండ్స్‌లో నేనన్న మాటకి గురుడు చేసిన సవరణ రెట్టనిపించింది.

"శిరోమణిగాడితో చెప్పాలి."

"వాడింక రాడు."

"ఎందుకని "

"వాడి కుద్యోగం దొరికింది. పెళ్ళి కుదిరింది కూడాను." ★




# సుభాషితాలు

మంచి అందం అనేది ఏదో ఒక ప్రత్యేకత వల్లే వస్తుంది. ముఖంమీది భాగాలు అందరికన్నా కొంచెం కురచో, పొడవో అవటంవల్ల ఆ ప్రత్యేకత వస్తుంది.

— బేకన్

* * *

అతిసామాన్యమైనసహజమైన అందమేఅన్నింటికన్నా గొప్పది. అందుకు కారణం అది భగవంతుని నిర్మాణము.

— బ్రవునింగ్

* * *

నా నిద్రలో జీవితమే సౌందర్యమయం అని కలగన్నాను. అయితే మెలకువ వచ్చాక జీవితం బాధ్యతామయమని తెలుసుకున్నాను. బాధ్యతను ధైర్యంగా ఎదుర్కొంటే అది క్రమేపీ సౌందర్యంగా మారుతుందని వివేకంతో తెలుసుకున్నా.

— ఎల్లన్

* * *

నిత్య ఆనందానికి అందం మూలం. అది దినదినాభివృద్ధి అవుతుందిగానినశించదు. అందుకు కారణం అందాన్ని తెలుసుకోవటం ప్రారంభమయాక ప్రకృతిలో ప్రతి నిత్యం అనేక క్రొత్త అందాలను చూడటం జరుగుతుంది.

— కీట్సు

* * *

సౌందర్యమే సత్యం. సత్యమే సౌందర్యం. ఈ భూమిపైన అందరూ తెలుసుకోవలసిన నిజం అది మాత్రమే.

— కీట్సు

* * *

ఒక విషయాన్ని మర్చిపోకండి. ప్రపంచంలో చాలా అందమయిన వస్తువులు నెమళ్ళు, పువ్వులలా నిరుపయోగంగా వుంటాయి.

— రస్కిన్

* * *

అందం అనేది మంచిది. అలానే మంచిఅనేది కూడా త్వరలో అందంగా మారుతుంది.

— సఫో

* * *

అందం అనేది చాలా తక్కువ కాలం మాత్రమే వుంటుంది. — సోక్రేట్సు

* * *

అందం అనేది అంతమవదు. తెలుసుకోగలిగితే అది క్రొత్త అందాలకు దారితీస్తుంది.

— ఆల్‌డ్రిచ్

సేకరణ:

కాకాని కమల